


ఆకలితో కడుపు చుట్టుకుపోతోంది. కడుపు ఖాళీగా నీళ్లులేని కూజాలా ఉంది. గుడ్డలు మాసిపోయి, గెడ్డాం పెరిగిపోయి ముష్టివాడిలా ఉన్నాను. జేబులో చిల్లిగవ్వకూడా లేదు. మనిషిని మాత్రం ఉన్నా. ఎక్కడికో తెలీదు, ఎందుకో తెలీదు, కాళ్లు నడిపిస్తున్నాయి!

నడిపించే చోటికే బయల్దేరాను. జీవితంలో ఓడిపోయినవాణ్ని – కాదు, ఓడింపబడిన వాణ్ని. నా శరీరం, డిగ్రీ సర్టిఫికేట్‌తో ఎస్. ఎల్. సి., రిజిష్టరు నా ఆస్తి! మొదటిది మంచి బట్టా, మొహానికింత పౌడరు, కడుపునిండా తిండీ ఉంటే రాణిస్తుంది! రెండోది బొజ్జలు పెంచే బురఖా బాబుల జేబుల్లో పచ్చనోట్లు పెడితే రాణిస్తుంది! రెండూలేవు నాదగ్గిర. అందుకే రెండూ రాణించటంలేదు, రెండింటి విలువ తెలియటం లేదు!!

జగదాంబా హాలుదగ్గర కొచ్చి నిలబడ్డా. 'మెకన్నాస్ గోల్డ్' ఆడుతోంది. ఈ హాలు నాకోసం కాదు. ఇంగ్లీషు అక్షరం ముక్కయినా రాక పోయినా వచ్చినట్టూ, అర్థమయినట్టూ ఫోజుకొట్టేవారికి ఆ ఫిల్ము. చుట్టూవున్న మనుషుల బుర్రలు బ్రద్దలుకొట్టి ఊహాల్లో తమబుర్రలకి కిరీటం పెట్టుకొనేవారికి ఆ ఫిల్ము!! ఓ కారాగింది. అందులో మోడ్రన్ లైజ్డ్ మొగుడూ, పెళ్ళాం, అమ్మాయిలోపాటు దిగారు. ఆ అమ్మాయి ఆకుపచ్చనిచీరకట్టుకుంది. మొహానికి పౌడరు, కళ్ళకు కాటుక, పెదాలకి లిప్ స్టిక్!! అందమైన మొహం! కారు లైట్లకాంతిలో ఆ అమ్మాయినిచూస్తే అమాంతం కౌగలించుకుందా మనిపించలేదు నాకు; నా చెల్లాయి గుర్తుకొచ్చింది. మానం కప్పుకుందుకుగాను ఖుట్ళుచీర కట్టుకొని, డోక్కుపోతున్న మొహంతో, కాంతిలేనికళ్ళతో, సన్నంగా బక్క చిక్కివున్న నా చెల్లాయి గుర్తుకొచ్చింది. కళ్ళంట నీళ్ళు అనుకోకుండా రాలాయి. నేనూ ఓ పెద్ద ఆఫీసర్నయితే నా చెల్లాయీ అలాగే ఉండేది– కాదు, ఇంతకంటే బాగుండేది! నన్ను ఆఫీసర్నవనివ్వలేదు ఈ ప్రపంచం. నాకు తెలివితేటలున్నాయి. నేచదివిన చదువుకు మెరిట్ ఉంది. పై చదువు చదివేందుకు అవకాశం కల్పించలేదీలోకం. ఉన్న చదువుకు సరైన ఉద్యోగం ఇప్పించలేదీ దేశం!

ఈ తప్పు ఈ దేశానిది. ఈ దేశనాయకులిది. వాళ్లుమాత్రం మేడల్లో బ్రతుకుతూ, కారుల్లో తిరుగుతూ బోటిల్ తర్వాత బోటిల్ విస్కీ సేవిస్తూ, మాంసం ముక్కలు కొరుకుతూ కైపులో కామకాంక్ష తీర్చుకుంటున్నారు వాళ్ళు తింటూన్నది కోడిమాంసం కాదు. నాలాంటి నిర్భాగ్యుల మాంసం మా కుత్తుకలు త్తరించి మమ్మల్ని వులావు వండించి తింటున్నారు. కడుపులు నింపుకుంటున్నారు, బొజ్జలు పెంచుతున్నారు!!

పౌనంతా రంగుదీపాల కాంతులతో శోభాయమానంగా ఉంది, ఔను. రేపు పండుగ. భారతదేశా

నీకి ఇరవై ఐదవ జన్మదినోత్సవం! ప్రతిచోటూ రంగు కాగితాలతో డెకొరేట్ చేసి ఉంది కౌను. స్కూళ్లూ, బేంకులూ, ఆఫీసులూ, ఆసుపత్రులూ కొందరి గొప్పవాళ్ళ యిళ్ళూ అన్నీ వేడుక చేస్తున్నాయి. ఇంటికి వెళ్ళా లనిపించలేదు. వెళితే వాళ్ళనుచూచి బాధ. అమ్మ, చెల్లాయి ఆకలితో వుంటే చూడలేను. మా కడుపు మంటలతో చలికాచుకుంటూన్న ఈ దేశనాయకుల్ని ఆ మంటల్లో పడేసి కాల్చేయాలనిపిస్తోంది. కాని కడుపు మంటలు వాళ్ళని దహించవు. పైగా వాళ్ళ స్థాయినే పెంచుతాయి! అసలైన మంటల్లోనె దహించాలి వాళ్ళని!!

కోపరేటివ్ బ్యాంకులోకి వెళ్ళేను. ఈ బ్యాంకు ప్యూను పోస్టుకి ఒక ప్పుడు నేను ఎప్లయి చేశాను. ఇస్తా మని అన్నారు. పెళ్ళి నిశ్చయం అయిన కుర్రాడిలా గంతులేశాను. మంచి వేగంతో బేంకునుంచి ఇంటికీ ఇంటినుంచి బేంకుకీ తిరిగేను. పది హేను ఉద్యోగాలకి ఎప్లయి చేసి నిష్ఫలం అయింతర్వాత ఈ ప్యూను పోస్టుకి పెట్టేను. కలోగంజో తాగేం దుకు అది చాలని ఎంతో సంతోషం వేసింది. బేంకు డైరక్టరుగారిని పది సార్లయినా కనీసం మీటయ్యాను. చివరికేమైంది? ఉద్యోగం నా కు రాలేదు. ఆడదాని రికమెండేషన్ తో మరొకడు కొట్టేశాడు. ఆవిడగారికి బేంకుబాబుగారికి ఉన్న సంబంధం ఆ ఉద్యోగం ఇప్పించింది వాడికి. శృంగార కేళీ వినోద కాలంలోని రికమెండేషను ముందు నా డెభ్భై మార్కులు నిలుస్తాయా? స్కూలు ఫైనలు పేసవడమే డిస్క్వాలిఫికే షన్ కింద నా అప్లికేషన్ కొట్టిపారే శారు. ఇదీ స్థితి. ఈ కష్టాలని అణచే వాడు లేడా? కూకటివ్రేళ్ళతో వీటిల్ని నిర్మూలించే ఉద్యమం అంటూవుంటే నేనో సభ్యుడ్నవుతా అందులో!

ఆ బేంకులో రంగుదీపాలు అలంక రించారు. స్టేజి కట్టారు. కూర్చునేం దుకు కుర్చీలు వేసివున్నాయి. మైక్ సెట్ ముందు స్టేజిమీద ఐదారుగురు కూర్చుని వున్నారు. దేశభక్తి గీతాలు పాడుతున్నారు వాళ్ళు. స్కూలుఫైనలు నుంచీ జనగణమన ఎప్పుడు పాడినా నా ఒళ్ళు పులక రించేది నా శరీరం మీదున్న వెంట్రుకలన్నీ ఆ గీతాన్ని వినేటం దుకా అన్నట్లు నిలుచుంటాయి నేను ఏదో లోకంలోకి వెళ్ళిపోతాను. ఈ గీతాలు వింటున్నా నాకదే అనిపిస్తున్నాదీ. ఆకలి బాధంతా పోయినట్టు మనసుకుహాయిగావుంది. ముష్టివాడిలా ఓమూల కూర్చున్న

నన్ను గెంటేయడానికి ఓ వ్యాను వచ్చేది. ఎవరో ఒకాయన ఇంతలో ఏదో చెపితే వాడు వెళ్ళిపోయాడు. నాముందు కాలేజీ కుర్రాళ్ళు నిలుచున్నారు. స్టేజిమీద ఇద్దరమ్మాయిలూ పాట పాడుతున్నారు.

'ఇవతల్ది లేదురా.... చూసావు.... బ్లేక్ బ్లౌజ్ వేసుకుంది, దానికెయ్యాలిరా....' ఒక కంఠం.

'ఈ వెధవ పాటలు పాడుతున్న ఆ అమ్మాయిని చూస్తే ఆ అమ్మాయికున్న అందం, గ్లామరు పోతున్నాయిరా' మరో కంఠం.

'సరదాగా నాలుగు ఎల్లారీశ్వరి పాటలు పాడకూడదూ?'

'స్వతంత్రులంకదురా.... అలా అని ఓ చీటీ రాసి పంపు'

-ఈ మాటలన్న వాళ్లలో ఒకడు మోతుబరి రైతు కొడుకవుతాడు. వాడికిపదేళ్ళక్రితమే 'జాగ్రత్త' పడిన వందెకరాల భూముంటుంది. ఒకడు మినిష్టరుగారికి మనవడవుతాడు. మరొకడు మంచి శరీరం ఉన్నవాడవుతాడు. రికమెండేషన్లతో వాడు మిలిటరీలో సెలక్టవుతాడు ఒకడు ఆఫీసరవుతాడు. ఒకడు ఏమీ చేయడు. కారుల్లో షికార్లు కొడతాడు నేను ఇలాగే వుంటాను. నన్ను వ్యాను గెంటేయడానికి వస్తాడు!

గొప్పవాడి ఆవగింజంతటి మెరిట్ని పెద్ద పర్వతం అంతదానిగా చేస్తారు పేదవాడి ఏనుగంతటి మెరిట్ని పీనుగబొమ్మగా మార్చేస్తారు ఇది జరుగుతున్నదీ రోజుల్లో. దండిగా ఉన్నవాడిని పొగిడేముందు వాడెలా ఆస్థితికొచ్చాడో ఆలోచించి మరీ పొగడాలి. మినిష్టరు కొడుక్కి మెడికల్ కాలేజీలో సీటు రాకఛస్తుందా! జాలరిపిల్లాడికి సముద్రపు ఈత వచ్చిందని పొగడ్డం దేనికి? వీడికి ఈత రావడం, వాడికి సీటు రావడం ఒకటే నా దృష్టిలో!

ఆవేశంతో, ఆకలితో, వాళ్లమీద అక్కసుతో అక్కడ్నుంచి బయల్దేరాను, కేంద్రంనుంచి ఎవరో అమాత్యశేఖరులవారు, అమానుష కృత్యాల ప్రతినిధిగారు వేంచేస్తున్నారని రోడ్లు 'పౌడర్లు' పులుముకున్నాయి. ఎలక్ట్రిక్ పోల్స్ ఈ విషయం చెప్పేందుకే అన్నట్లు వెలుగుతున్నాయి!! పూలదుకాణాలకి బోలెడు బేరం! ఈ అవినీతి నాయకుల మెడల్లో పడేందుకు పూలదుకాణాల్లో పూలు విలపిస్తున్నాయి. మీటింగు ప్రదేశానికి వెళ్ళేను. జనం బాగా ఉన్నారు. అల్లరి జరగకుండా పోలీసులు వచ్చారు. జాగాశోషం కొట్టుకుంటూన్న వాళ్ళపై లాఠీలు ఎత్తి జడిపిస్తున్నారు వాళ్ళు. గగ్గోలు

ప్రారంభమయిందింతలో. 'మంత్రిగారొస్తున్నారు' అని వినిపించింది. కారాగింది. హాసవదనంతో దిగి వేదికమీద కూర్చున్నారాయన. అయిదు నిముషాలపాటు చైర్మన్ గారు ఆయన గొప్పదనం గూర్చి మాట్లాడారు. పన్నెండుగంటలు కొట్టేరు దేశంకోసం అసువులు అర్పించిన మహనీయుల జ్ఞాపకార్థం రెండు నిముషాలు మౌనం వహించాలని అన్నారు మంత్రిగారు. నిలబడ్డాం రెండు నిముషాలు.

మైకు తీసుకు ప్రారంభించేరు మంత్రిగారు తమ ఉపన్యాసం. వినేందుకేముంటుంది దాంట్లో? చెప్పేందుకు మాత్రం వుంటుంది. ఆయనగారు భారతాన్ని ఎలా ఆకట్టుకున్నారో చెప్పొచ్చు. వాగ్దానాల వర్షంతో జనాన్ని ఎలా తడిపి ముద్దచేశారో చెప్పొచ్చు. గంగిరెద్దుల్లా వాళ్ళు ఎలా తలలాడించారో చెప్పొచ్చు. దేశ సౌభాగ్యం, సౌభ్రాతృత్వం, అవీ, ఇవీ, ఒకటే 'ఒక బ్యులరీ'! ఒకరి ఉపన్యాసం వింటే మరొకరిది వినక్కర్లేదు. ఇక్కడ ఈ మంత్రి, అక్కడ ఆ మంత్రి, ఎక్కడ అల్లా మంత్రి ఇలాగే చెప్తారు. ఇలాగే ఉపన్యాసాలు దంచేస్తారు. గరీబు లేకుండా చేస్తామంటారు. నిరుద్యోగాన్ని నిర్మూలించేస్తామంటారు. నాలాంటి నిర్భాగ్యుల్ని అలాగే ఉంచుతారు. మా జీవితాల్ని 'డెడ్ రోడ్స్'గా చేస్తారు. మాకు దారి కావాలి! అవును, దారికావాలి! ఆ దారిలో ఆకలి ఆక్రందనలు వినబడకూడదు. ఆ దారిలో సర్వమానవ సమానత్వం చాటబడాలి. ఆ దారి ఏది? ఏదైతేనేం, ఆ దారిలోనే నా పయనం!!

నా కాలికి అడ్డంగా ఓ జువ్వ వచ్చిపడింది. పండుగ చేస్తున్నారు. గొప్పవాళ్ళు. స్వాతంత్ర్యోత్సవం చేస్తున్నారు. బాణసంచా కాల్పిస్తున్నాడో దేశభక్తి పరాయణుడు. వాడి ఇంటిమీద జెండా ఎగరేయించాడు. ఇందతా షో. మేడమీంచి చూస్తున్నాడు గర్వంతో. అది కావాలి వాడికి. ఆ సుపీరియారిటీ కావాలి, దేశ సౌభాగ్యం కాదు - కావలిస్తే, మేడపైన మేడలెలా కట్టగలడు? ఓ జువ్వ ఆకాశంలోకి దూసుకుపోయి అక్కడ పేలింది. జువ్వలోని మందు మనిషికున్న బేక్‌గ్రౌండ్, వాడికున్న ఆస్తి; రాయబారం రికమెండేషన్; రాయబారం అందితే అలా ఆకాశంలోకి ఎగరొచ్చు. అందకపోతే వెనకనుంచి ముట్టిస్తారు జువ్వని. ముట్టించి నేలపై వదేస్తారు. కొంచెం ఎత్తు ఎగురుదామని ప్రయత్నించి ఎగిరి

క్రింద పడిపోతుంది. 'నేను మందు లేని జువ్వను. ఎగిరే శక్తి లేదు. వెలిగిస్తే కాలిపోతాను. అదే నా జీవితం' అని అందరి దృష్టి; నేను మందులేని జువ్వనే కావొచ్చు. అందులో ఉన్న మందు వందేకరాల భూమికాదు. దానికి రాయబారం రికమెండేషనుకాదు. అందులో ఆవేశం కూరబడ్డది. అది నీతితో పైకి ఎగురుతుంది. అవినీతిని అది అట్టడుగున కాల్చివేస్తుంది. అవినీతి నాయకుల్ని అంధుల్ని చేస్తుంది!

లక్ష్మీటాకీసు టర్నింగ్ తిరిగేను. మా యిల్లు యింకా ఫర్లాంగు ఉంది. వెనకనుంచి కార్ హారన్ వినబడ్డాది. రోడ్డుప్రక్కగ తప్పుకున్నా. గ్రామ నాయకుడుగారు మీటింగయిపోయి వస్తున్నారు! ఓ ఇంటి దగ్గరాగింది కారు. అది రామాయమ్మ యిల్లు. 'అయ్యగారు మంచి డోసులో ఉన్నారు. నిన్ను తీసుకొస్తామంటే ఇక్కడికే వస్తానని అల్లరిచేసారు' అనిచెప్పి అయన్ని లోపలికి తీసుకెళ్ళేడు. ఇదీ ఆడదానికి ఈయన చేసే గౌరవం నాలుగు పెగ్గులు బిగించి మానాన్ని అవమానపరుస్తున్నాడు! వీళ్ళు మన నాయకులు! అతడి దారి రామాయమ్మ ఇంటికి తీసుకెళ్ళింది! నా దారి?!

కొళాయి దగ్గరికి. కడుపు నింపుకొనేందుకు కొళాయి దగ్గరికి తీసుకెళ్ళింది. నీళ్ళు పడడంలేదు! వీధిదీపం కాంతిలోంచి కొళాయి బుర్ర ఎర్రగా కనిపించింది. అది ఓ పిస్టల్ లాఉంది. అర్థమైంది! నేను ఎగరలేని జువ్వనుకాను. ఎగరగలిగే రాకెట్‌ను. తలలూపే గంగిరెద్దును కాను. దాన్ని ఆడించే వాణ్ని. దేశకాల పరిస్థితులన్నీ దేశాన్ని ఓ దారికి తీసుకెళ్తున్నాయి. ఈ స్ట్రైకులు, ఆందోళనలు, అరాచకాలు అందుకు నిదర్శనాలు. నా జీవితం నాకో దారి చూపింది. నా దారే అందరి దారి!

నా నడక దేశం నడక!

